9
సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
బుధవారం । 25 । అక్టోబర్ । 2023

న్యూస్‌రీల్

ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



కాజీపేట అర్బన్: సీఎం కేసీఆర్ ఈనెల 27న వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. 44వ డివిజన్ పరిధి భట్టుపల్లిలోని ఎస్సార్ కళాశాల పక్కన ఉన్న మైదానంలో నిర్వహించే సభ ఏర్పాట్లను మంగళవారం ఎర్రబెల్లి దయాకర్‌రావు, అరూరి రమేశ్ పరిశీలించారు. వారివెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

'యూడైస్'లో వివరాలు

విద్యారణ్యపురి: వచ్చే ఏడాది మార్చిలో జరిగే టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వివరాలను ఈసారి యూడైస్ పోర్టల్ ద్వారానే తీసుకుంటారని హనుమకొండ డీఈఓ ఎం డీ.అబ్దుల్‌హై ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు ఈనెల 28లోగా.. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ తదితర వివరాల్ని అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం పరిశీలించి తేడాలుంటే యూడైస్‌ప్లస్.గౌట్.ఇన్ పోర్టల్‌లో సరిచేసుకోవాలని సూచించారు.

'రూ.18 కోట్లు' తాగేశారు

కాజీపేట అర్బన్: వరంగల్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మందుబాబులు రూ.18కోట్ల విలువైన మద్యం తాగేశారు. కాజీపేట, హనుమకొండ, వరంగల్ అర్బన్, ఖిలావరంగల్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిల 65 వైన్స్, 121 బార్లు ఉన్నాయి. దసరా పండుగ నేపథ్యంలో గతేడాది రూ.12.5 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరగ్గా.. ఈ ఏడాది రూ.5.50 కోట్ల వ్యాపారం అదనంగా జరిగింది.

తైక్వాండోలో మనోళ్ల హవా



హన్మకొండ: ఈనెల 21, 22వ తేదీల్లో తిరుపతిలోని శ్రీనివాస స్టేడియంలో కేవీ బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ రాష్ట్ర తైక్వాండో పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో విహాన్ గోల్డ్, సబ్ జూనియర్ విభాగంలో శశాంక్, ప్రణవి బంగారు పతకాలు, సాన్వి, పూర్వి, పవన్ కాంస్య పతకాలు సాధించారు. సిద్ధార్థ, సంజయ్ సిల్వర్ మెడల్స్, సాయిశివ కాంస్య పతకాలను సాధించారు. క్రీడాకారులకు ఎస్‌ఐఎస్ కోచ్‌గా వి.నరసింహ వ్యవహరించినట్లు తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వావిలాల సారంగపాణి తెలిపారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా రాజు



మడికొండ: మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జిల్లా అధికార ప్రతినిధిగా కాజీపేట మండలం మడికొండకు చెందిన వస్కుల రాజును ఎంపిక చేసినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కల వెంకటస్వామి తెలిపారు. అదేవిధంగా కాజీపేట మండల ప్రధాన కార్యదర్శిగా గద్దల శ్యామ్, 4వ డివిజన్ అధ్యక్షుడిగా మునిగాల శ్రీనుని ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వారికి మంగళవారం నియామక పత్రాల్ని అందించారు.

పెంబర్తి చెక్‌పోస్ట్ తనిఖీ
- సిబ్బంది పని తీరును పరిశీలించిన సీపీ

'పేట'.. ఓట్ల కోట
- పోలింగ్‌లో టాప్ నర్సంపేట
- 2014 ఎన్నికల్లో టాప్‌టెన్‌లో స్థానం..
- 90శాతం దాటుతున్న పోలింగ్

నాడు ఎన్నికల ఖర్చు రూ.4లక్షల్లోపే..
- మానుకోట మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య

- వివరాలు 10లో▸







వరంగల్ రంగలీల మైదానంలో రావణ వధ కార్యక్రమాన్ని తిలకిస్తున్న జనం, (ఇన్‌సెట్‌లో) రంగశాయిపేటలో దహనం అవుతున్న రావణ ప్రతిమ

రంగలీల మైదానంలో దహనం అవుతున్న రావణ ప్రతిమ

విజయీభవ..

వైభవంగా దసరా వేడుకలు

నగర ప్రజలు సోమవారం విజయదశమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. వాహన, ఆయుధ పూజ నిర్వహించారు. సాయంత్రం శమీ వృక్షానికి పూజలు చేసి అశేష జనవాహిని నడుమ రావణాసుర వధ నిర్వహించారు. అలాయ్.. బలాయ్ తీసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఉత్సవాలు జరిగిన కాశిబుగ్గ, వడ్డేపల్లి చెరువు, ఉర్సు రంగలీల మైదానం, చిన్న వడ్డేపల్లి చెరువు, రంగశాయిపేట మహంకాళి ఆలయం, పద్మాక్షి గుట్ట తదితర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. భద్రకాళి, రుద్రేశ్వరాలయం, పద్మాక్షి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉర్సుగుట్టకు వేలాది సంఖ్యలో ప్రజలు తరలిరాగా.. వరంగల్ బ్రిడ్జి సమీపం ఫాదర్ కొలంబో ఆస్పత్రి నుంచే వాహనాల్ని పార్కింగ్ చేయడం కనిపించింది. ఉత్సవం ముగిశాక ప్రజలు ఇంటికి చేరుకునేందుకు దాదాపు రెండు గంటల సమయం పట్టింది. బాణాసంచాతో రావణున్ని దహనం చేస్తుండగా ప్రజలు ఫోన్లలో వీడియోలు రికార్డు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆయా కార్యక్రమాల్లో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మేయర్ గుండు సుధారాణి, స్థానిక ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కాశిబుగ్గ చిన్నవడ్డేపల్లి చెరువు ప్రాంగణం వద్ద..

వైభవంగా భద్రకాళీభద్రేశ్వరుల కల్యాణం



కల్యాణోత్సవంలో తాళి చూపుతున్న అర్చకుడు శేషు

- ముగిసిన శరన్నరాత్రి ఉత్సవాలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ శ్రీభద్రకాళి ఆలయంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ప్రధాన అర్చకులు శేషు ఆధ్వర్యంలో భద్రకాళీభద్రేశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. పద్మశాలీ మేళా కమిటీ చేనేత కళాకారులు రమేశ్ ఆధ్వర్యంలో ఆలయంలో మగ్గం ఏర్పాటు చేసి గద్వాల్ పట్టుచీర తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. వేడుకను తిలకించడానికి భక్తులు తరలివచ్చారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు.

ఘనంగా తెప్పోత్సవం..

సోమవారం విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీభద్రకాళి అమ్మవారు నిజరూప దర్శనంలో భక్తులను అనుగ్రహించారు. ఉదయం నిత్యాహ్నికం, కళోద్వాసన, అమ్మవారికి సామ్రాజ్యపట్టాభిషేకం నిర్వహించి చక్రతీర్థోత్సవం, ధ్వజారోహణం చేశారు. సాయంత్రం శమీపూజలు చేశారు. అనంతరం అమ్మవారికి హంసవాహనంపై తెప్పోత్సవం చేపట్టారు. తెపోత్సవంలో వరంగల్ సీపీ అంబర్‌కిషోర్‌ఝా, వద్దిరాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి భద్రకాళి చెరువులో తెప్పోత్సవం

కమిషనరేట్‌లో ఘనంగా ఆయుధ పూజ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఎంటీ విభాగం అధికారులు ఆయుధాలతో పాటు వాహనాలకు పూజలు చేశారు. అనంతరం జమ్మిచెట్టుకు పూజ జరిపారు. అధికారులకు, సిబ్బందికి స్వీట్లు అందించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సమాజంలో చెడును పారదోలేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీపీలు రవీందర్, బారీ, అదనపు డీసీపీలు సంజీవ్, సురేశ్‌కుమార్, ఆర్‌ఐలు శ్రీనివాస్, శ్రీధర్, పర్జున్ రాజు, చంద్రశేఖర్, ఉదయ్‌భాస్కర్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్ పాల్గొన్నారు.



ఆయుధ పూజలో పాల్గొన్న సీపీ, ఇతర అధికారులు

ఇక ఇంటింటికి తిరుగుడే..!

గడువులోగా గడపగడపకు పార్టీలు
- ఉమ్మడి వరంగల్‌లో ఊపందుకున్న ఎన్నికల ప్రచారం
- ముందంజలో బీఆర్‌ఎస్.. మరో మూడు స్థానాలపై బీజేపీ కసరత్తు
- ఏడు సీట్లపై నేడు కాంగ్రెస్ అధికారిక ప్రకటన



సాక్షిప్రతినిధి, వరంగల్: సార్వత్రిక ఎన్నికల సమరం ఇక సాదాసీదాగా ఉండే పరిస్థితి లేదు. ఇప్పటికే అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకున్న ఆశావహులు.. అభ్యర్థిత్వం ఖరారు కాగానే దూకుడు పెంచుతున్నారు. సుమారు నెలన్నర ముందుగానే 11 నియోజకవర్గాలకు బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఖరారు కాగా.. జనగామకు ఇటీవలే అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రచారం క్షేత్రస్థాయిలో హోరెత్తగా.. అధికారికంగా నాలుగు స్థానాలకు ఖరారైన కాంగ్రెస్ అభ్యర్థులు, గ్రీన్‌సిగ్నల్ అందుకున్న వారు సైతం ప్రచారం చేసుకుంటున్నారు. బీజేపీ సైతం మూడు రోజుల క్రితం 9 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. అవకాశం దొరకని ఆశావహులను బుజ్జగించగా.. అభ్యర్థులు ప్రచారానికి సిద్ధమవుతున్నారు. అన్ని పార్టీలు కూడా దసరా పండుగ నేపథ్యంలో రెండు రోజులు పల్లెలకు వెళ్లడానికి విరామం ఇచ్చారు. మంగళవారం నుంచి మళ్లీ మొదలెట్టి.. గడపగడపకు చేరేలా వ్యూహంతో ముందుకెళ్తున్నారు.

ఇంకా ఆగేది లేదు..

కాంగ్రెస్, బీజేపీలతో పోలిస్తే బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో ఉన్నారు. నెలన్నర క్రితమే అభ్యర్థులు ఖరారు కాగా, 'బీ'ఫాంలు అందుకుని ప్రచార సామగ్రితో ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ తొలి జాబితాలో ములుగు, భూపాలపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, నర్సంపేట నియోజకవర్గాలకు ఎమ్మెల్యే ధనసరి సీతక్క, గండ్ర సత్యనారాయణ, సింగాపురం ఇందిర, దొంతి మాధవరెడ్డి పేర్లను ప్రకటించింది. అదే సమయంలో వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, పరకాల, జనగామ నియోజకవర్గాల్లో పని చేసుకోవాల్సిందిగా నాయిని రాజేందర్‌రెడ్డి, కొండా సురేఖ, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కొమ్మూరి ప్రతాపరెడ్డిలకు పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్లు పార్టీవర్గాల్లో చర్చ. బుధవారం మలి విడత జాబితాపై కాంగ్రెస్ నాయకత్వం భేటీ అయి ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. బీజేపీ సైతం ఈనెల 22న ప్రకటించిన తొలి జాబితాలో పరకాల, ములుగు, నర్సంపేట నియోజకవర్గాలు మినహా తొమ్మిది నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. రావు పద్మ, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, చందుపట్ల కీర్తిరెడ్డి, హుస్సేన్ నాయక్, ఆరుట్ల దశమంతరెడ్డి, కొండేటి శ్రీధర్, జి.విజయరామారావు వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రచారం షురూ చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఇప్పటికే ఒకటి, రెండు పర్యాయాలు నియోజకవర్గాలను చుట్టేయగా.. ఆలస్యంగా అభ్యర్థిత్వాలు ఖరారు కావడంతో ఇప్పటికైనా ప్రచారాన్ని ముమ్మరం చేయాలనే యోచనలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఉన్నారు.

ముంచుకొస్తున్న నామినేషన్ల గడువు..

శాసనసభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల గడువు తరుముకొస్తున్నా ఉమ్మడి వరంగల్‌లో చాలా నియోజకవర్గాల్లో ఎన్నికల వేడి కనిపించడం లేదు. పార్టీల పరంగా చూస్తే అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ఇప్పటికే ఒకటి, రెండు దఫాలు నియోజకవర్గాల్లో పర్యటించిన బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఈసారి క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తిరిగే కార్యక్రమాన్ని మంగళవారం మొదలుపెట్టారు. నామినేషన్ల గడువులోపు బస్తీలను చుట్టేయాలని భావిస్తున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే నాలుగు నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించగా ఎనిమిది సీట్లపై అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. బీజేపీ తొలి జాబితాలోనే 9 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినా.. చాలామంది ప్రచారంలోకి దిగలేదు. మరో మూడు స్థానాలకు ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. దీంతో ఎవరికి టికెట్ వస్తుందో తెలియక పార్టీ నేతలు నర్సంపేట, ములుగు, పరకాలపై ఎదురుచూపు ధోరణిలో ఉన్నారు. మరో వారం రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండగా.. అదే రోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఒకటి, రెండు రోజుల్లో అభ్యర్థులను ఖరారు చేస్తే బాగుంటుందని కాంగ్రెస్, బీజేపీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

అంతా సైలెంట్!

- గోప్యంగానే.. కేంద్ర బృందం పర్యటన
- కుంగిన బ్యారేజీ.. మరమ్మతు లేని పంపుహౌస్!
- బ్యారేజీ, పంపుహౌస్‌ల వద్ద పోలీస్ పహారా
- రబీ సీజన్‌కు సాగు నీరు కష్టమే

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బ్యారేజీని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ బృందం మంగళవారం పరిశీలించింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అతి కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ శనివారం రెండు ఫీట్లమేర కుంగి ప్రమాదస్థాయికి చేరిన విషయం తెలిసిందే. దీంతో చైర్మన్ అనిల్ జైన్ ఆధ్వర్యంలోని ఆరుగురు సభ్యుల బృందం నిశితంగా పరిశీలించింది. వారు సుమారు రెండు గంటల పాటు బ్యారేజీ వద్ద గడిపినా.. ఇరిగేషన్‌శాఖ ఈఎన్‌సీతో తప్ప ఇతరులతో మాట్లాడలేదు. అంతా సైలెంట్‌గా సాగిపోయింది. 6, 7వ బ్లాక్‌లోని 15 నుంచి 22 వరకు పియర్ వరకు కాలినడకన వెళ్లిన బృందం ఎవరినీ అనుమతించలేదు. అంతా గోప్యంగానే వ్యవహరించారు.

నిరుడు తట్టుకొని నిలబడినా..

గతేడాది జూలైలో 28.5లక్షల క్యూసెక్కుల వరద చేరి మహదేవపూర్ మండల పరిధి లక్ష్మీపంపుహౌస్ నీట మునిగింది. 2వ, 3వ టీఎంసీలకు చెందిన 17 మోటార్లు మునిగిపోగా.. అందులో 3వ టీఎంసీకి చెందిన ఆరు మోటార్లు పూర్తిగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం శనివారం కాళేశ్వరం ప్రాజెక్టులోనే ముఖ్యమైన మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాక్‌లోని 20వ పిల్లర్ పగుళ్లతో కుంగింది. ఆ సమయంలో నిల్వ ఉన్న 10టీఎంసీల నీటిని ప్రస్తుతం మూడు రోజులుగా ఇరిగేషన్ అధికారులు 85గేట్లలో 57గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. మహారాష్ట్రలోని ప్రాణహిత నది నుంచి 22వేల క్యూసెక్కుల నీరు తరలి వస్తున్నది. నిరుడు అత్యధిక వరదను తట్టుకొని నిలబడిన ఈ బ్యారేజీ ఇప్పుడు పగుళ్లు తేలడంతో కుంగుతోంది.

హాట్ టాపిక్‌గా..

రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ఫీవర్ నడుస్తుండడంతో బ్యారేజీ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ప్రతిపక్ష నాయకుల్లో ఎవరి నోట విన్నా కాళేశ్వరం బ్యారేజీ కుంగిందని, నాణ్యతకు తిలోదకాలిచ్చారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఏఐఎఫ్‌బీ నాయకులు జోజిరెడ్డి బ్యారేజీ చూసేందుకు వస్తే పోలీసులు అడ్డుకొని తరువాత అందులో ఇద్దరికి అనుమతి ఇవ్వడంతో వెళ్లి చూశారు. కాగా, పోలీసులను బ్యారేజీ ప్రాంతంలో భారీగా మోహరించడంతో మీడియాతో పాటు ఇతరులెవరూ బ్యారేజీ లోపలికి వెళ్లడం లేదు.

రబీకి కష్టమే..

తెలంగాణ వ్యాప్తంగా సుమారు 40లక్షల ఎకరాలకు కొత్త, పాత ఆయకట్టుకు సాగునీరందించే ప్రాజెక్టుకు కష్టమొచ్చింది. ప్రాజెక్టులో అతి కీలకమైన లక్ష్మీపంపుహౌస్ నిరుడు అధిక వర్షాలతో మునిగి మోటార్లు చెడిపోయాయి. ఇప్పటికీ మరమ్మతు కాలేదు. ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ పగుళ్ల తేలి అర మీటరు లోతు కుంగింది. దీంతో మరమ్మతు చేసే వరకు నీటిని నిల్వ చేసి బ్యాక్‌వాటర్‌ను రబీ సీజన్‌లో సాగు నీరు అందించడం కష్టమే. రాష్ట్రంలో ఇప్పటికే ఎండలు దంచి కొడుతున్నాయి. అక్కడక్కడా బ్యారేజీల్లో నీరు వట్టిపోతున్నది. ఇప్పటి నుంచి నీటిని నిల్వ చేస్తేనే రబీ సీజన్‌కు అందుతుందని పలువురు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పంపుహౌస్ నిషేధిత ప్రాంతంగానే ఉంది. బ్యారేజీ వద్ద 144 సెక్షన్ కొనసాగుతోంది. పోలీసులు ఆధీనంలోకి తీసుకొని నిరంతరం బందోబస్తును నిర్వహిస్తున్నారు. కుట్రకోణం ఉందని ఇప్పటికే ఎస్సీ ఏఈ రవికాంత్ ఇచ్చిన ఫిర్యాదుతో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామని, విచారణ జరుగుతోందని ఎస్పీ కిరణ్‌ఖరే ఒక ప్రకటనలో తెలిపారు. ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు రెండు రోజుల క్రితం విలేకర్లతో మాట్లాడుతూ.. నెలన్నరలో బ్యారేజీకి మరమ్మతు చేసి పూర్వపు స్థితికి తీసుకువస్తామన్నారు.



బ్యారేజీ వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

అక్కడ ఎస్కేప్.. ఇక్కడ అరెస్ట్

- గంజాయి ముఠా పట్టివేత, రిమాండ్
- రూ.5లక్షల విలువైన ఎండు గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి

హసన్‌పర్తి: రైల్వే పోలీసుల నుంచి తప్పించుకున్న ఓ గంజాయి ముఠా చివరికి కాకతీయ యూనివర్సిటీ పోలీసులకు చిక్కింది. వారి వద్ద నుంచి సుమారు రూ.5లక్షల విలువైన (20 కిలోల ఎండు) గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్ట్‌చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కేయూ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన మంగళవారం వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ముజ్ఫపూర్‌కు చెందిన ఎండీ.సాహిల్ కసబ్, సనోజ్‌కుమార్, రేష్మా ఓ ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో సాహిల్, రేష్మా భార్యాభర్తలు. సులభంగా డబ్బులు సంపాదించడానికి ముగ్గురు ఓ ముఠాగా ఏర్పడి గంజాయి వ్యాపారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి గంజాయిని తక్కువ ధరకు ఖరీదు చేసి అక్కడి నుంచి రైలులో ఉత్తరప్రదేశ్‌కు తీసుకెళ్లి ఎక్కువ ధరకు విక్రయించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి కిలో గంజాయిని రూ.2వేలకు కొనుగోలు చేసిన అనంతరం వైజాగ్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు బయల్దేరారు. రైలులో గంజాయి తరలిస్తున్నారనే సమాచారం కాజీపేట రైల్వేపోలీసులకు అందింది. దీంతో వారు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు ప్రారంభించారు. రైల్వే పోలీసుల నుంచి తప్పించుకున్న ఆ ముఠా ఆటోలో వంద ఫీట్ల రోడ్డు మీదుగా వరంగల్ వైపు వెళ్తుండగా.. వడ్డెపల్లి చర్చి సమీపంలో కేయూ పోలీసుల తనిఖీలో చిక్కారు. వారి వద్ద లభ్యమైన గంజాయిని సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య తెలిపారు. ఈ తనిఖీలో ఎస్సై విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంఘర్షణాత్మక విలువల మధ్య స్పష్టతే ఎన్నికల ప్రధాన లక్ష్యం.
- టీఎన్ శేషన్



ఈ ముచ్చటెరుగుదురా?

'నోటా' అంటే తెలుసా..



హన్మకొండ అర్బన్: ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులెవరూ నచ్చకపోతే ఓటర్లు నోటాకు ఓటు వేయొచ్చు. నోటా అంటే (నన్ ఆఫ్ ద ఎబో) పైవారెవరూ కాదనే నిర్ణయాన్ని ఓటు రూపంలో తెలపాచ్చు. అందుకోసం ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌లో అభ్యర్థుల పేర్లకు దిగువన నోటా ఉంటుంది. ఓటర్లు ప్రిసైడింగ్ అధికారిని వివరాలు అడిగి తెలుసుకుని 'నోటా' నమోదు చేయొచ్చు.

పెంబర్తి చెక్ పోస్ట్ తనిఖీ

- సిబ్బంది పని తీరును పరిశీలించిన సీపీ అంబర్ కిశోర్ ఝా

జనగామ/వరంగల్ క్రైం: జనగామ మండలం పెంబర్తి బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సోమవారం అర్ధరాత్రి తనిఖీ చేశారు. కమిషనరేట్ పరిధిలో పోలీసులు పనితీరు, చెక్ పోస్టుల నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సీపీ ముమ్మరంగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా పెంబర్తి చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్టు సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై పలు సూచనలు చేశారు. అక్కడ నుంచి నేరుగా రైల్వేస్టేషన్‌కు చేరుకుని తనిఖీలను పర్యవేక్షించారు.

రూ.2.31 కోట్లు పట్టివేత..

జిల్లా సరిహద్దు పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ఇప్పటి వరకు రూ. 2.31కోట్ల విలువైన నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, 770 గ్రాముల వెండి, 5,451.31 గ్రాముల బంగారం సీజ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 685 బెల్ట్ దుకాణాలను మూసి వేసి 12 వేల 475 లీటర్ల మద్యం సీజ్ చేశారు.

జంగ్ తెలంగాణ



చెక్ పోస్టు వద్ద సీపీ అంబర్ కిషోర్ ఝా

'పేట'.. ఓట్ల కోట..

పోలింగ్‌లో టాప్ నర్సంపేట

- 2014లో రాష్ట్రంలో టాప్ టెన్‌లో స్థానం..
- 90 శాతం దాటుతున్న పోలింగ్
- చివరలో వరంగల్ పశ్చిమ
- 60 శాతం లోపే పోలింగ్

కాశోజీ సెంటర్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మొత్తం 12 నియోజకవర్గాల్లో నర్సంపేట ఓట్ల కోటగా వెలుగొందుతోంది. ప్రతి ఎన్నికల్లోనూ పోలింగ్ శాతం నమోదులో ప్రథమ స్థానంలో నిలుస్తోంది. సాధారణ, ఉప, స్థానిక సంస్థలు.. ఇలా ఎన్నికలు ఏవైనా సరే పోలింగ్ నమోదులో మాత్రం మొదటి స్థానం నర్సపేంట నియోజకవర్గానిదే. ఇక విద్యావంతుల నియోజకవర్గం, పట్టణ ప్రాంతం.. ప్రస్తుతం గ్రేటర్ వరంగల్‌లోనే పూర్తిగా ఉన్న వరంగల్ పశ్చిమ (2009 వరకు హనుమకొండగా ఉండేది) మాత్రం పోలింగ్ నమోదులో జిల్లాలో అట్టడుగు స్థానంలో నిలుస్తూ వచ్చింది. పేరుకు మాత్రం విద్యావంతుల నియోజకవర్గంగా ఉన్నా సమయానికి ఓటు హక్కును వినియోగంచుకోవడంలో మాత్రం ఇక్కడి ఓటరు ఎందుకో బద్ధకం వీడట్లేదనిపిస్తోంది. నర్సంపేట మాత్రం 2004 ఎన్నికల్లో ఏకంగా రాష్ట్రంలో అత్యధికంగా పోలింగ్ నమోదైన టాప్‌టెన్ నియోజక వర్గాల్లో ఒకటిగా రికార్డుల్లో కెక్కింది. 2004లో 82.29 పోలింగ్ శాతంత నమోదు కావడం విశేషం.

మొదటి నుంచి ముందు స్థానమే..


నర్సపేట నియోజకవర్గంలో మారుమూల గ్రామాలు, పల్లెలు, గిరిజన తండాలు, ఆదివాసీ గ్రామాలు అధికంగా ఉన్నాయి. అయినా ఇక్కడ ప్రతీ ఎన్నికల్లో పోలింగ్ శాతం జిల్లా పోలింగ్ శాతం కన్నా ఎక్కువగా నమోదవుతోంది. విప్లవ పార్టీలు, వామపక్ష పార్టీలకు కేంద్రస్థానంగా ఉన్న నర్సంపేట నియోజకవర్గంలో ప్రజల్లో ఓటు చైతన్యం ఎక్కువగా ఉండటం వల్లనే ఇది సాధ్యమవుతోంది. నర్సంపేట శాసన సభ నియోజక వర్గం పరిధిలో ప్రతిసారి కనీసం 50 పోలింగ్ బూత్‌లలో 90 శాతానికి పైగా పోలింగ్ నమోదవుతుండటం విశేషం. వీటిలో కొన్ని బూత్‌లలో 95 శాతం వరకు పోలింగ్ నమోదైన సందర్భాలు ఉన్నాయి.

ప్రతిసారి పెరుగుదలే..

జిల్లాలోని మిగతా నియోజక వర్గాల మాదిరి ఒక్కోసారి ఒక్కో విధంగా వస్తే పెద్దగా విశేషం ఉండేదికాదు. ప్రస్తుతం 1999 సాధారణ ఎన్నికల నాటి నుంచి వరుసగా మూడు ఎన్నికలు పరిశీలిస్తే.. ఎప్పటి కప్పుడు పోలింగ్ శాతం మరింత పెరుగుతూ నర్సంపేట తన ప్రత్యేకతను చాటుకుంటోంది. 1999లో 80.70శాతం, 2004లో 82.29శాతం, 2009లో 84.69శాతం చొప్పున పోలింగ్‌శాతం పెరుగుతూ వస్తోంది. ఇక పంచాయతీ ఎన్నికలు, ప్రాదేశిక ఎన్నికల్లో కూడా పోలింగ్ శాతం అధికంగానే నమోదైంది.

'పశ్చిమ' చివరి స్థానంలో..


ఉమ్మడి జిల్లాలోని మిగతా అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పరుగులు పెడుతుంటే.. మేధావులు, విద్యావంతులు, ఉద్యోగులు, అర్బన్ ప్రాంత ఓటర్లుండే వరంగల్ పశ్చిమలో మాత్రం పోలింగ్ శాతం నిరాశజనకంగా ఉంటుంది. ఓటర్ల నమోదుకు ప్రత్యేక కార్యక్రమాలు, ప్రచార ఆర్భాటం, ఓటరు చైతన్య కార్యక్రమాలు ఎన్ని చేపట్టినా ఇక్కడ పెద్దగా మార్పు రావడం లేదు. విచిత్రం ఏమిటంటే.. నర్సంపేటలో ఎప్పుడూ 80 శాతం పైగా పోలింగ్ ఉంటే వరంగల్ పశ్చిమలో మాత్రం పట్టుమని 60 శాతం దాటకపోవడం విశేషం.



2009 సంవత్సర సాధారణ ఎన్నికలతో పోల్చితే 2018 సంవత్సరంలో జిల్లా మొత్తంలో అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగింది. అయినా.. ఎప్పటి లాగే నర్సంపేట మళ్లీ మొదటి స్థానంలో, వరంగల్ పశ్చిమ చివరి స్థానంలో నిలిచాయి.

గత నాలుగు సాధారణ ఎన్నికల్లో నర్సపేట, వరంగల్ పశ్చిమలో పోలింగ్ శాతం

నియోజకవర్గం	నర్సంపేట	వరంగల్ పశ్చిమ
1999	80.70	59.01
2004	82.29	59.28
2009	84.69	53.22
2014	87.83	56.83
2018	90.06	58.29



2009, 2018 సంవత్సరాల్లో పోలింగ్ శాతం

నియోజకవర్గం	2009	2018	పెరుగుదల శాతం
జనగామ	71.96	85.6	13.64
స్టేషన్‌ఘన్‌పూర్	76	86.19	10.19
పాలకుర్తి	78.50	88.5	10
డోర్నకల్	81.19	88.88	7.69
మహబూబాబాద్	77.53	84.83	7.3
నర్సంపేట	84.69	90.6	5.37
పరకాల	76.45	89.28	12.83
వరంగల్(ప)	53.22	58.29	5.07
వరంగల్(తూ)	59.87	72.86	12.99
వర్ధన్నపేట	68	83.37	15.37
భూపాలపల్లి	71	82.13	11.13
ములుగు	74	82.53	8.53
మొత్తం	72.84	82.75	9.91

నాడు ఎన్నికల ఖర్చు రూ. 4 లక్షల లోపే..

- నాటి, నేటి రాజకీయానికి చాలా వ్యత్యాసం
- మానుకోట మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య
- 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ



మహబూబాబాద్: 'నాటి, నేటి రాజకీయానికి చాలా వ్యత్యాసం ఉంది. నేటి రాజకీయం డబ్బుతో ముడి పడింది. నాడు 1994లో కేవలం రూ. 4 లక్షల లోపే ఖర్చు చేసి ఎమ్మెల్యేనయ్యా. అంత వరకు మానుకోట నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోట. ఆ కంచుకోటను ఢీకొట్టడానికి సీపీఐ అభ్యర్థిగా బరిలో దిగిన నేను గెలుపొందానని' మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య అన్నారు. నాటి, నేటి ఎన్నికలకు తేడా, ఓటర్లు, ఇతరత్రా విషయాలపై ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

1994లో మానుకోట నుంచి ఎమ్మెల్యే గెలిచా..

1994లో అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, సీపీఐ, సీపీఎం కూటమిగా ఏర్పడ్డాయి. పొత్తుల్లో భాగంగా మానుకోట సీటు సీపీఐకి కేటాయించారు. అయితే అప్పటికే ఈ నియోజకవర్గం కాంగ్రెస్ కంచుకోట. ఇక్కడి నుంచి ఐదు సార్లు వరుసగా ఆ పార్టీ గెలుపొందింది. అయినా పార్టీని ఢీకొని గెలుపొందా. అప్పటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జెన్నారెడ్డి జనార్దన్‌రెడ్డిపై సుమారు 10 వేల పైచిలుకు మెజార్టీతో గెలిచి ఆ కంచుకోటపై సీపీఐ జెండా ఎగురవేశా.

కేవలం రూ. 4 లక్షల ఖర్చుతోనే..

ప్రచార వాహనాలు, సమావేశాలు, వాల్ పోస్టర్లు, ఇతరత్రా అంశాలకు ఆ ఎన్నికల్లో కేవలం రూ. 4 లక్షలలోపే ఖర్చు అయింది. ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయడంతో పాటు ఎమ్మెల్యే కాక ముందు పేదల పక్షాన పోరాటాలు చేసి సుమారు 3వేల మంది పేదలకు ప్రభుత్వ స్థలాలు ఇప్పించా. నాడు పేదల సమస్యలపై చేసిన పోరాటాలు నన్ను గెలిపించాయి. ఆ ఎన్నికలు భూ స్వాములకు వ్యతిరేకంగా జరిగాయి.

గెలిచిన అనంతరం ఎంతో అభివృద్ధి..

ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం మానుకోటకు వంద పడకల ఆస్పత్రిని మంజూరు చేయించా. తండాలు, గ్రామాలకు రోడ్లు, ఇతరత్రా పనులు చేయించా. ప్రధానంగా ఆ సమయంలో హౌస్ కమిటీ ఏర్పాటు చేసి భూస్వాములు కబ్జా చేసిన 12వేల ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నాం. గూడూరు నుంచి చెన్నారావు పేట మండలం వరకు ఉన్న అటవీ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టా. లక్షల ఎకరాల భూమి కబ్జా కాకుండా చూశా. 70 మంది స్వాతంత్ర్య సమరయోధులకు న్యాయం చేశా.

నాడు ఆరు మండలాలు..

1994లో నియోజకవర్గ పరిధిలో ఆరు మండలాలు ఉన్నాయి. పూర్తి స్థాయిలో మానుకోట , కేసముద్రం , నెక్కొండ ఉండగా నెల్లికుదురు, గూడూరు, చెన్నారావు పేట మండలాల్లోని కొన్ని గ్రామాలు ఈ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. హౌస్ కమిటీ ద్వారా భూముల స్వాధీనం, ఇతరత్రా కార్యక్రమాలు చేపట్టినప్పుడు భూస్వాములు ఆ కమిటీ రద్దు చేస్తే రూ. 50 లక్షలు ఇస్తానన్నా ఎలాంటి ఆఫర్లకు లొంగకుండా పేదల కోసం పని చేశా. నేను గెలిచిన తర్వాత గడీల్లో జిల్లేడు మొక్కలు పెరిగాయి. గడీల రాజకీయాలకు చెక్ పడింది.

3 వేల ఓట్ల తేడాతో ఓటమి..

1989లో కూటమిలో భాగంగా సీపీఐ తరఫున పోటీ చేయగా, కాంగ్రెస్ అభ్యర్థి జెన్నారెడ్డి జనార్దన్ రెడ్డి చేతిలో కేవలం 3వేల ఓట్ల తేడాతో ఓడిపోయా. నాడు టీడీపీ నాయకులు కొంత మంది తన గెలుపు కోసం పని చేయలేదు. వారు వెన్నుపోటు పొడిచారు.

నేటి రాజకీయంలో డబ్బే కీలకం..

నేడు అభ్యర్థుల ఎంపిక విషయంలో ఆర్థిక పరిస్థితిని ప్రధానంగా చూస్తున్నారు. ఎంత డబ్బు అయినా ఖర్చు చేసే వారికి టికెట్ ఇస్తున్నారు. దీంతో టికెట్ నుంచే డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఓటర్లకు కూడా డబ్బు తీసుకోవడం అలవాటు చేశారు. అయినా ఓటర్లు తెలివిగల వారు. ఎవరు డబ్బు ఇచ్చినా తీసుకుని ఆలోచించి ఓటు వేస్తున్నారు.



బంగారం స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కోమళ్ల వద్ద 5 కేజీల బంగారం పట్టివేత

- విలువ రూ. 3.09 కోట్లు

రఘునాథపల్లి: మండలంలోని కోమళ్ల టోల్ ప్లాజా వద్ద భారీ ఎత్తున బంగారం పట్టుబడింది. టోల్‌గేట్ వద్ద పోలీసులు సోమవారం తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో అనుమతి లేకుండా తరలిస్తున్న రూ. 3.9 కోట్ల విలువైన 5 కిలోల 441 గ్రాముల బంగారం లభించింది. ఆధారం చూపకపోవడంతో ఈ మొత్తాన్ని సీజ్ చేసి ఐటీ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించినట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి సీఐలు రాజు, శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వరంగల్ వైపునకు వస్తున్న బీవీసీ లాజిస్టిక్ వాహనాన్ని తనిఖీ చేయగా టైటాన్, మలబార్ గోల్డ్ షాపులకు చెందిన 5 కేజీల 441 గ్రాముల బంగారం గుర్తించి సీజ్ చేశారు. కాగా, ఎస్సైలు రఘుపతి, హరికృష్ణ, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

రూ.3.15 లక్షల నగదు స్వాధీనం..

రేగొండ: మండలంలోని ఇంటర్ డిస్ట్రిక్ చెక్ పోస్టు చెన్నాపూర్ క్రాస్ వద్ద మంగళవారం చేపట్టిన తనిఖీల్లో రూ.3.15 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తీగల మాధవ్ తెలిపారు. దుంపిలపల్లి గ్రామానికి చెందిన పిండి రమేష్ నుంచి ఎలాంటి ఆధారాలు లేని నగదును స్వాధీనం చేసుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు ఎస్సై మాధవ్ తెలిపారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై

విద్యుదాఘాతానికి రైతు బలి

గూడూరు: విద్యుదాఘాతానికి ఓ రైతు బలయ్యాడు. ఈ ఘటన మండలంలోని దుబ్బగూడెంలో జరిగింది. గ్రామానికి చెందిన అజ్మీరా రవి (35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. వరి పంటకు పురుగుమందు పిచికారీ చేయడానికి మంగళవారం ఉదయం వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. అక్కడ పొలంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద అమర్చి ఉంది. వరి మడిలో నీరు ఉండడంతో ఆ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ ద్వారా షాక్ వచ్చింది. అది గమనించని రవి.. ఆ వైర్ సమీపంలోకి వచ్చి మందు పిచికారీ చేస్తుండగా విద్యుదాఘాతం సంభవించి అక్కడిక్కడే మృతి చెందాడు. తల్లి అచాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం..

మహబూబాబాద్ రూరల్ : రైలు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం మానుకోట రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. జీఆర్పీ డోర్నకల్ ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం పట్టణంలోని వెంకటేశ్వర బజార్‌కు చెందిన కటకం శ్రీనివాస్ (48) మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని ఎమ్మార్పీఎస్ కాలనీ సమీపంలో ట్రాక్ దాటుతున్నాడు. ఈ క్రమంలో షిర్డీ ఎక్స్ ప్రెస్ వెనుక నుంచి శ్రీనివాస్‌ను ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఖమ్మంకు చెందిన అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.



శ్రీనివాస్ (ఫైల్)

బైక్ అదుపు తప్పి గీత కార్మికుడు..

హసన్‌పర్తి: బైక్ అదుపు తప్పి ఓ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం హసన్‌పర్తి మండలం సిద్ధాపురంలో జరిగింది. గ్రామానికి చెందిన కొక్కిస రమేష్ (35) కల్లు గీసిన అనంతరం బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో క్షతగాత్రుడిని ఎంజీఎం తరలించారు. అయితే రమేష్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు.. వ్యాపారి ఆత్మహత్య

వరంగల్ క్రైం: సుబేదారి పీఎస్ పరిధిలోని న్యూశాయంపేట, ద్వారకానగర్‌కు చెందిన వ్యాపారి బోయినపల్లి సురేష్‌కుమార్ (52) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరోనా సమయంలో వ్యాపారంలో నష్టం రావడంతో కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబీకులు గమనించి ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ షూకుర్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి..

స్టేషన్‌ఘన్‌పూర్: కుటుంబ కలహాలతో డివిజన్ కేంద్రానికి చెందిన రాయపురం సాంబరాజు (25) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాంబరాజుకు దాదాపు ఏడాది క్రితం సుమాంజలితో వివాహం జరిగింది. ఈ క్రమంలో కొంతకాలంగా దంపతుల మధ్య తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతుడి తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, సాంబరాజు మృతిపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పండుగ పూట విషాదం..

- విద్యుదాఘాతంతో కానిస్టేబుల్ మృతి
- టీఎస్ఎస్పీ విజయ దుర్గమ్మ గుడిలో ఘటన
- మైలారం, టీఎస్ఎస్పీ బెటాలియన్‌లో విషాదం



రాజేష్ అంత్యక్రియల్లో గౌరవవందనం చేస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) రాజేష్(ఫైల్)

మామునూరు: దసరా పండుగ సందర్భంగా ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. విద్యుదాఘాతంతో ఓ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ ఘటన టీఎస్ఎస్పీ ప్రాంగణంలోని విజయ దుర్గమ్మ గుడి వద్ద జరిగింది. రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎస్సై గూడెల్లి యాకయ్య, సుమతి దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు రాజేష్ (32) మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో స్పెషల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో దసరా సందర్భంగా టీఎస్ఎస్పీ ప్రాంగణంలోని విజయ దుర్గమ్మ గుడి వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం తెల్లవారు జామున బండలు జారీ కింద పడిపోయే క్రమంలో రాజేష్ అక్కడే ఉన్న జీరో బల్బు వైర్‌ను చేతితో అందుకున్నాడు. దీంతో షాక్‌కు గురై కేకలు వేశాడు. గమనించిన సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసే లోపు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో వెంటనే ఎంజీఎం తరలించారు. అక్కడ పరీక్షించగా రాజేష్ అప్పటికే మృతి చెందారని వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయం తెలిసిన వెంటనే కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి ఎంజీఎం చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. దీంతో రాయపర్తి మండలం మైలారం గ్రామం, టీఎస్ ఎస్పీ బెటాలియన్‌లో విషాదం అలుముకుంది. మృతుడి తండ్రి యాకయ్య, టీఎస్ఎస్పీ బెటాలియన్ అధికారుల ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు. కాగా, మృతుడికి భార్య గౌతమి, కుమారుడు ఉన్నారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గూడెల్లి రాజేష్ మామునూరులో టీఎస్ఎస్పీ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. ఈ సందర్భంగా బెటాలియన్ ఎస్పీతోపాటు పోలీసులు గ్రామానికి చేరుకుని అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి గ్రామానికి చేరుకుని రాజేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

చెక్ డ్యాం చూడడానికి వెళ్లి అన్నదమ్ముల మృతి

నడికూడ/ రేగొండ : పండుగ వేళ ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. వాగులో పడి అన్నదమ్ములు మృతి చెందారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా నడికూడ మండలం నార్లాపూర్ గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన దొపతి సమ్మిరెడ్డికి ఇద్దరు కుమారులు దొపతి జగన్ రెడ్డి(33) మల్లారెడ్డి(31) ఉన్నారు. ఇందులో జగన్‌రెడ్డి సాఫ్ట్‌వేర్, మల్లారెడ్డి బ్యాంక్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఇద్దరి అత్తగారి ఊరు మండలంలోని వరికోల్‌కు చేరుకున్నారు. సోమవారం సరదాగా పక్కన ఉన్న నార్లాపూర్ చెక్ డ్యాం చూసేందుకు వెళ్లారు. అక్కడ వాగులో ఈత కొడుతూ వరద నీటిలో గల్లంతయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు వీరి కోసం వెతకగా ఆచూకీ లభించలేదు. దీంతో కేకలు వేయగా స్థానికులు ఘటనాస్థలికి చేరుకుని గాలింపు చేపట్టగా ఇద్దరి మృతదేహాలు లభించాయి. దీనిపై స్థానికుల సమాచారం మేరకు పరకాల సీఐ వెంకటరత్నం, ఎస్సై రమేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనపై మృతుల తండ్రి సమ్మిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.

పార్టీలో ఎప్పుడు చేరుతున్నావ్..

పండుగ పూట ఇంటికి పిలిచి పిడిగుద్దులు

- బాధితుడిని పరామర్శించి వస్తున్న యువకుడిపై కూడా..
- ఎమ్మెల్యే నరేందర్ అనుచరుల వీరంగం

ఖిలా వరంగల్: తమ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోసం ప్రచారం చేయాలంటూ పండగ పూట ఇంటికి పిలిపించి దాడి చేసిన సంఘటన వరంగల్ శంభునిపేటలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. వరంగల్ శంభునిపేట విశ్వనాథ కాలనీకి చెందిన కర్నె వాసుదేవ్‌ను సోమవారం సాయంత్రం దసరా దావత్‌కు రావాలని అదే కాలనీకి చెందిన లారీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేముల భూపాల్, అతడి సోదరుడు వేముల క్రాంతి, విలాసాగరపు రాజేశ్ ఫోన్ చేసి ఆహ్వానించారు. వారి ఆహ్వానం మేరకు సాయంత్రం 4 గంటలకు కర్నె వాసుదేవ్.. వేముల భూపాల్ ఇంటికి వెళ్లాడు. భూపాల్ మద్యం గ్లాస్ ఇచ్చి వాసుదేవ్‌ను తాగాలని ఒత్తిడి చేయగా.. తాను తాగడం మానేశానని తిరస్కరించాడు. ఆ వెంటనే భూపాల్.. ఎమ్మెల్యే నరేందర్‌కు ఫోన్‌ చేసి మాట్లాడమని వాసుదేవ్‌కు ఇచ్చాడు. 'ఏం సంగతి. పార్టీలో ఎప్పుడు చేరుతున్నావ్' అని ఎమ్మెల్యే అడగ్గా.. కాస్త టైం తీసుకుని చెప్తాను సార్' అంటూ వాసుదేశ్ సమాధానం ఇచ్చాడు. ఆవెంటనే ఎమ్మెల్యే ఫోన్ కట్ చేశాడు. ఆతర్వాత 'ఏంరా నువ్ బీజేపీలో తిరుగుతున్నావు. బీఆర్ఎస్‌లో చేరి ఎమ్మెల్యే అభ్యర్థి నరేందర్‌కు గెలుపు కోసం పని చేయాలె. లేదంటే కథ మరోలా ఉంటది. అని భూపాల్, క్రాంతి కలిసి వాసుదేవ్‌పై దాడి చేసేందుకు యత్నించారు. రేపు ఆలోచించి చెబుతా.. అంటూ అక్కడి నుంచి ఇంటికెళ్లేందుకు యత్నించగా.. 'రేపేందిరా నువ్ చెప్పేది' అంటూ వేముల భూపాల్, అతడి అనుచరులు వాసుదేవ్‌పై పిడిగుద్దులు కురిపించారు. ఎట్టకేలకు అక్కడి నుంచి తప్పించుకొని వాసుదేవ్ ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న అతడి అన్న కుమారుడు వంశీ.. పరామర్శించేందుకు వాసుదేవ్ వద్దకు వచ్చి వెళ్తుండగా.. భూపాల్, క్రాంతి, విలాసాగరపు రాజేశ్ మరికొందరు కలిసి రోడ్డుపై అడ్డుకుని వంశీని కొట్టారు. అదే సమయంలో పోలీసులు చేరుకుని దాడి చేస్తున్న వారిని అడ్డుకుని పూర్తి వివరాలు సేకరించారు. బాధితులు వాసుదేవ్, వంశీ మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం వేముల భూపాల్, క్రాంతి, విలాసాగరం రాజేశ్, మరో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ టి.సురేశ్‌గౌడ్ తెలిపారు.